వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



గురువారం 07 ఆగష్టు 2025



మంత్రి వర్గ సమావేశం లో పాల్గొన్న మంత్రి రాంప్రసాదరెడ్డి

## రాయచోటి - మదనపల్లి మధ్య

# ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చర్యలు

### మంత్రి మండిపల్లి సూచన



**రాయచోటి పట్టణం, ఆగస్టు6 ప్రభాతవార్త**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సమావేశమైన (NHAI) ఛైర్మన్ ఆర్.కె. సింగ్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే రాయచోటి, మదనపల్లి మధ్య రహదారిపై రహదారి ప్రమాదాల నివారణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (NHAI) ఛైర్మన్ ఆర్.కె. సింగ్, రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా, రాయచోటి - మదనపల్లి మధ్య ప్రయాణం చేసే వాహనదారుల భద్రత దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రణాళికలో ఉన్న అండర్ పాస్ స్థానంలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ ఐలాండ్‌లు కీలకంగా ఉంటాయని పేర్కొంటూ, అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ మేరకు తగిన ప్రణాళికను రూపొందించి త్వరితగతిన అమలు చేయాలనీ, ప్రజల ప్రయాణ భద్రతకు ఎలాంటి తడబాటు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు.

# పులివెందుల అత్యంత సమస్యాత్మక ప్రాంతం

### ఒక పార్టీ ప్రచారం చేసే చోట ఇంకో పార్టీ వెళ్ళకూడదు

### పోలీసుల సూచనలు ఉల్లంఘిస్తే ఘర్షణలకు బాధ్యత వహించం

### ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశాం

### కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్



**పులివెందుల,ఆగస్ట్ 6,ప్రభాత వార్త:**

పులివెందుల ప్రాంతం అత్యంత సమస్యాత్మక ప్రాంతం అని ఎపుడు ఎన్నికలు జరిగిన ఇక్కడ కక్షలు,హత్యలు అనాదిగా జరుగుతున్నాయి అని ఎన్నికల ప్రశాంతంగా జరగడానికి పటిష్ట ఏర్పాట్లు చేశామని కర్నూల్ డిఐజి కోయ ప్రవీణ్ అన్నారు. స్థానిక డిఎస్పి కార్యాలయం నందు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ ప్రచారం చేసే చోట ఇంకో పార్టీ వెళ్ళ కూడదనీ పోలీసుల సూచనలు ఉల్లంఘిస్తే ఘర్షణలకు మేము బాధ్యత వహించ లేమని అన్నారు. పులివెందుల సహజంగా సమస్యాత్మక ప్రాంతం అయినందున ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పార్టీలు జోన్లుగా వేయించి వాళ్లకు తగిన సూచనలు చేశామని ఒక పార్టీ ప్రచారం చేస్తున్న సందర్భంలో ఇంకో పార్టీ అక్కడ వెళ్లకూడదని స్పష్టంగా చెప్పాం అన్నారు. అయితే ప్రచారంలో మంగళవారం ఒక ఘర్షణ సంఘటన జరిగింది అని బుధవారం మధ్యాహ్నం నల్లగొండు వారి పల్లిలో జరిగిన ఘర్షణ విషయమై సంఘటన స్థలాన్నీ పరిశీలించామని ఈ ఘర్షణపై ఆరా తీయగా ఇటీవల టీడీపీలో చేరిన నాగేంద్ర రెడ్డి ఇంటికి వెళ్ళి వైసీపీ నేత రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ నాగేంద్ర రెడ్డిని బెదిరిస్తే కార్యకర్తలు ఆవేశం గుర్రై ఈ దాడి చేశారని టిడిపి నేతలు చెబుతున్నారన్నారు.ఈ ఘటన సంబంధించి పూర్తి వివరాలు సేకరించాల్సి ఉందన్నారు.గత చరిత్ర దృష్ట్యా రాజకీయ పార్టీలు నిర్ణీత ప్రాంతంలోనే ప్రచారం చేయాలని పోలీసుల సూచనలను ఉల్లంఘిస్తే జరిగే ఘర్షణలకు మేం బాధ్యత వహించలేమని తెలిపారు. రామలింగారెడ్డి లకు నల్లగొండు వారి పల్లె కి వెళ్ళేడానికి అనుమతులు లేవని అయిన వెళ్ళి అక్కడ పత్యాపారం చేయాలని చూస్తే ఇలానే జరుగుతుందని తెలిపారు. పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నిక తొమ్మిది ప్రాంతాల్లో 15 పోలింగ్ బూత్లను రెవెన్యూ అధికారులు కేటాయించారు అని ఎన్నికల్లో నిర్వహించే ప్రాంతాలను స్వయంగా పరిశీలించా అని అంతర్ జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక ఫికెటింగ్ ఏర్పాటు చేశా మని ఎన్నికల కోడ్ పులివెందుల రెవెన్యూ సబ్ డివిజన్ మొత్తం వర్తిస్తుందన్నారు. పులివెందుల కు వచ్చి వెళ్లే మార్గాల్లో కూడా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని పులివెందుల పరిధిలో ఉన్న ప్రైవేటు వ్యక్తుల తుపాకులను స్వాధీనం చేసుకున్నామని సింహాద్రిపురంలో ఇంకా తుపాకులను సీజ్ చేయాల్సి ఉంది అది కూడా త్వరలో చేస్తామన్నారు.ఎన్నికలకు విఘాతం కలిగించే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ట్రబుల్ సూటర్స్ పై బైండోవర్ కేసులు నమోదు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ మురళి ,పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట డివిజన్‌ను ప్రగతిపథంలో తీసుకువెళ్తా

### నూతన సబ్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన



బాధ్యతలు చేపట్టేందుకు ఛాంబర్‌లో సబ్ కలెక్టర్ భావన

**రాజంపేట, ఆగస్టు6 ప్రభాతవార్త**

రాజంపేట డివిజన్ ను ప్రగతి పథంలోకి తీసుకెళ్లేలా కృషి చేస్తానని నూతన సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమె బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆమె జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరు ని రాయచోట్లో కలిశారు. ఆమెకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావనని అభినందించి, రాజంపేట డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాధితులు స్వీకరించే ముందు సబ్ కలెక్టర్ తన చాంబర్లు సాంప్రదాయంగా పూజలు నిర్వహించారు. అంతకుముందు సబ్ కలెక్టర్ రాజంపేటకు వచ్చిన సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్, రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని, సిసి కిరణ్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. బాధితులు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రాజంపేట డివిజన్ కు మంచి పేరు ఉందని తెలిపారు. దీన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు అందరూ కలిసి కట్టుగా కష్టపడి పనిచేయాలని సూచించారు. పలువురు తాసిల్దార్లు నూతన సబ్ కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# చిన్నారి అనుమానాస్పద మృతి

**యర్రగుంట్ల ఆగస్టు 6 ప్రభాతవార్త**



పట్టణంలో వినాయక నగర్‌లో ఒక చిన్నారి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం మేరకు అరిఫా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడం జరిగింది. ఆరిఫా రాని వ్వనంలో గల స్కూలులో నాలుగో తరగతి చదువుకుంటుంది. ఆరిఫా తల్లి ఉదయాన్నే స్కూలుకు వెళ్ళమని చెప్పి రెడీ చేసి పనికి వెళ్లడం జరిగింది. తండ్రి అలీబాషా ట్రాక్టర్కు లోడింగ్ పనికి వెళ్ళాడు. మధ్యాహ్నం మూడున్నర సమయంలో ఆలీ భాష ఇంటికి వెళ్ళగా కూర్చుని ఉన్న కూతురు స్పృహలో లేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆరిఫా(9సం) చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఉయ్యాల ఊగుతూ గొంతుకు బిగించుకొని ఊపిరాడక చనిపోయిందని స్థానికులు అంటున్నారు. సిఐ నరేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది.

# నాన్నా, అక్కా క్షమించండి

### చదవలేక పోతున్నా..అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా

### ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య



**మదనపల్లెక్రైమ్, ఆగష్టు 6 ప్రభాతవార్త.**

నాన్నా , అక్క క్షమించండి.. మీరనుకున్నంత స్థాయిలో చదవలేక పోతున్నా, అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా అంటూ బిటెక్ విద్యార్థిని సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సుధాకర్ రెడ్డి, లేట్ సుగుణ దంపతులకు కుమార్తె లు అశ్విని, ప్రసన్న, రెడ్డి శ్రావణి లు ఉన్నారు. తల్లి సుగుణ 5 సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా, తండ్రి సుధాకర్ రెడ్డి అన్నీ తానై చేనేత మగ్గాల పని చేసుకుంటూ ముగ్గురు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె అశ్విని కి వివాహం చేశాడు. రెండవ కుమార్తె ప్రసన్న డిగ్రీ వరకు చదివి ఇంటిపట్టునే ఉంటోంది. మూడో కుమార్తె రెడ్డి శ్రావణి(19) పులివెందుల జెఎన్టీయూ కళాశాల నందు బిటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. శ్రావణి ని, సుధాకర్ రెడ్డి మూడు రోజుల క్రితం కళాశాల వెళ్లి ఇంటికి తీసుకొచ్చాడు. చదువు ఒత్తిడి ని భరించలేని రెడ్డి శ్రావణి తనపై నాన్న, అక్క పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టలేక పోతున్నానట్టు తనలో తానే కుంగిపోయి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ మేరకు సూసైడ్ నోట్ రాసి 4 వ తేదీ రాత్రి ఓసారి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి విరమించుకుంది. అయినా తనలో చనిపోవాలని ఆలోచన పెరిగిపోవడంతో 5 వ తేదీ మంగళవారం అర్థరాత్రి నాన్న, అక్క గాఢనిద్రలో ఉన్న సమయంలో తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయాన్నే నిద్ర లేచిన తండ్రి సుధాకర్ రెడ్డి కుమార్తె ఉరికి వేలాడుతుండటాన్ని చూసి కుప్పకూలిపోయాడు. గట్టిగా కేకలు వేస్తూ, మరో కుమార్తె ప్రసన్న తో కలిసి ఆర్తనాదాలు చేశారు. స్థానికులు గుమికూడి ఎంతపని చేశావు శ్రావణి అంటూ నిట్టూర్చారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతురాలు రాసిన సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఊటీ తరహాలో హార్సిలీహిల్స్‌లో

# సుందరీకరణ పనులు

### పర్యాటకుల పెంపుకు కృషి : జిల్లా కలెక్టర్ శ్రీధర్-చామకూరి



జ్యోతి ప్రజ్వళన చేసి పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

ఊటీ తరహాలో హార్సిలీహిల్స్‌లో సుందరీకరణ పనులు చేపట్టి పర్యాటకుల పెంపుకు కృషి చేస్తామని న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం హార్సిలీహిల్స్‌లో సుందరీకరణ పనుల్లో భాగంగా జిల్లా కలెక్టర్ వెల్‌కమ్ టు హార్సిలీహిల్స్ బోర్డును, హరిత హోటల్ ఎదురుగా ఉన్నటువంటి కూడలిలో వాటర్‌పాంట్‌ను, రెవెన్యూశాఖ సహకారంతో హోటల్ బ్రీజోరా పనులను వినాయకస్వామి పూజలు చేసి కలెక్టర్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో మద్యం, మత్తు పదార్థాలు సేవించి ప్రభుత్వ ఆస్థులను ధ్వంసం చేసినా, పర్యాటకులకు ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు. హార్సిలీహిల్స్‌లో పర్యాటకులను ఆకర్షించేందుకు వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. హార్సిలీహిల్స్ పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఏజెన్సీల ద్వారా కొత్తగా కార్మికులను ఏర్పాటుచేస్తామన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటి గార్డులను నియమించడం జరుగుతుందన్నారు. పర్యాటకులకు భద్రత కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకొంటామన్నారు. పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన ఐలవ్‌యూ హార్సిలీ హిల్స్ బోర్డు ఏర్పాటును, హార్సిలీహిల్స్ నందు ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఆధునీకరణపనులను, జిడ్డు క్రిష్ణమూర్తి కూడలి, వివేకానంద విగ్రహాలకు ఏర్పాటుచేసిన డ్రిల్స్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహశీల్దార్ బావాజాన్, ఎంపిడిఓ క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలసాధికారత కోసమే మిషన్ శక్తి



2 లో

# వైసీపీ నాయకులపై దాడి

### వేల్పుల రామలింగారెడ్డి కి తీవ్ర గాయాలు

### ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ చేయి విరిగిన వైనం

### ఆసుపత్రి వద్దకు భారీగా తరలి వచ్చిన వైసీపీ శ్రేణులు

### పులివెందులకు చేరుకున్న డిఐజీ కోయ ప్రవీణ్ , ఎస్పీ అశోక్ కుమార్

**పులివెందుల, ఆగస్ట్ 6, ప్రభాత వార్త:**



గాయపడిన రామలింగారెడ్డి

పులివెందుల మండల పరిధిలోని నల్లగోండువారి పల్లె గ్రామం వద్ద టీడీపీ వర్గీయులు చేసిన దాడిలో వైసీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి,శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్ లు గాయపడ్డారు.పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక ప్రచారం వైసీపీ టీడీపీ నేతలు ముమ్మరం చేశారు.అయితే గత రెండు రోజులుగా వైసీపీ , టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు తీవ్ర తరం దాలుస్తున్నాయి. ప్రచారంలో భాగంగా బుధవారం మధ్యాహం నల్లగొండువారిపల్లె గ్రామంలో వైసీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్ తదితర నాయకులు వెళ్ళగా గ్రామంలోకి చేరు కోగానే టీడీపీ వర్గీయుల కార్లతో వైసీపీ నేతలు వచ్చిన కార్లను అడ్డగించగా వారు కారు దిగకపోతే కార్లను ధ్వంసం చేసి పెట్రోల్ వేయడంతో కారు నుంచి బయటకు రాగానే కారులో ఉన్న రామలింగారెడ్డినీ ఈడ్చుకెళ్లి కొట్టినారు అని అలాగే రమేష్ యాదవ్ కి చెయ్యి విరగగొట్టాగా మిగిలిన వారిని కూడా కట్టెలతో కొట్టినట్టు,గ్రామంలోని మహిళలు అడ్డులేకపోతే రామలింగారెడ్డి పరిస్థితి ఇంకో విధంగా ఉండేది అని వైకాపా వర్గీయులు తెలిపాయి. పోలీసులు అక్కడకి చేరుకొని చెదర గొట్టి గాయాలు అయిన వారిని పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించా రు.ఆసుపత్రి వద్దకు విషయం తెలిసిన వెంటనే ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డితో పాటు నియోజక వర్గ నాయకులు మండల నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అక్కడకి చేరుకున్న వారిని నియంత్రించడం కష్టం అయింది.విషయం తెలియడం తో కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ ఈ జి అశోక్ కుమార్ పులివెందులకు చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. ఈ ఘటన పై బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేస్తునట్టు పోలీసులు తెలిపారు.



రమేష్ యాదవ్‌కి చెయ్యి విరిగిన దృశ్యం





దాడిలో దెబ్బతిన్న వాహనాలు

### అన్నమయ్య, కడప జిల్లాల్లో

# 23మంది సీఐల బదిలీలు

2 లో

# మండిపల్లి రాక..!

- ఏకత్రాటిపైకి కూటమి పార్టీల నేతలు
- జడ్పీటీసి ఎన్నికపై దిశ నిర్దేశం
- ఒంటిమిట్ట తెలుగుతమ్ముళ్లల్లో జోరు నింపిన మంత్రి..!
- పెరిగిన కూటమి అభ్యర్థి విజయావకాశాలు

**( అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా తెలుగుతమ్ముళ్లు ఏడాది కాలంగా నిరాశ నిస్పృహలతో గడుపుతున్న ఏకైక నియోజకవర్గం రాష్ట్రంలో రాజంపేట ఒకటి. రాష్ట్రంలో వైసిపి గెలిచిన 11 స్థానాల్లో రాజంపేట ఒకటి. అప్పటి నుండి ఈ నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు అధిస్ఠానం నుండి సరైన ప్రోత్సాహం లేక ఓటమి భారాన్ని జీర్ణించుకోలేక దిక్కుతోచనిస్థితిలో సతమతమవుతూ వస్తున్నారు. ఇప్పుడు జడ్పీటీసి ఎన్నిక జరుగుతున్న ఒంటిమిట్ట మండలం రాజంపేట నియోజకవర్గంలోనే ఉంది. కడప, అన్నమయ్య జిల్లాల ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా ఉండిన ప్రస్తుత రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాధరెడ్డి ఈ మండలం నుండే జడ్పీటీసీగా ఎన్నికైనారు. శాసనసభ్యుడిగా ఎన్నికవ్వడంతో జడ్పీ ఛైర్మెన్ పదవితో పాటు జడ్పీటీసీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక జరుగుతుంది. దీంతో ఈ జడ్పీటీసి స్థానాన్ని గెలుచుకోవడం కూటమి పార్టీలకు ప్రతిష్టాత్మకం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మండలంలో వైసిపికి 3వేల పైచిలుకు మెజార్టీ లభించింది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఆదేశాలతో ఒంటిమిట్టకు మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి వచ్చి కూటమి పార్టీల నేతలందరిని ఏకత్రాటిపైకి తేవడమే కాకుండా జడ్పీటీసి అభ్యర్థిగా అడ్డలూరు ముద్దుక్రిష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ప్రకటించి కూటమి నేతల సమక్షంలో తెలుగుదేశం పార్టీ బీ ఫామ్‌ను అందజేశారు. అంతకు ముందుగా మంత్రి మండిపల్లి ప్రత్యేక పర్యవేక్షణలో జడ్పీటీసి స్థానానికి నామినేషన్లు వేసిన కూటమికి చెందిన పలువురు అభ్యర్థులతో మాట్లాడి వారి నామినేషన్లు విత్ డ్రా చేసుకొని టిడిపి అభ్యర్థి విజయానికి పరిస్థితులను సానుకూలంగా మార్చారు. మొత్తానికి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్ట మండలంలో పర్యటించి, కూటమి నేతలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించడమే కాకుండా ఈనెల 12వ తేదీ జరగనున్న జడ్పీటీసి ఎన్నికల్లో విజయం సాధించేందుకు దిశా నిర్దేశం చేశారు. దీంతో తెలుగు తమ్ముళ్లతో పాటు కూటమి పార్టీ నేతలందరిలో ఉత్సాహం నెలకొంది. ఒంటిమిట్ట అభివృద్ధికి నాంది పలికింది తెలుగుదేశం పార్టీనేనన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, భవిష్యత్తులో అభివృద్ధి జరగాలంటే జడ్పీటీసి స్థానంలో కూటమి అభ్యర్థి విజయం అత్యావసరమన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, అందరూ సమిష్టి కృషితో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రికి కానుకగా ఇచ్చేలా కూటమి నేతల్లో ఉత్సాహాన్ని నింపడంలో మంత్రి సఫలీకృతుడయ్యారని చెప్పవచ్చు. మొత్తానికి తెలుగు తమ్ముళ్లతో పాటు కూటమి నేతలందరిలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి జోరు పెంచడంలో విజయం సాధించారని చెప్పవచ్చు. దీంతో ఈ మండలంలో కూటమి అభ్యర్థి విజయావకాశాలు పెరిగాయని చెప్పవచ్చు. ప్రస్తుతం తెలుగుతమ్ముళ్లు కూడా మంత్రి మండిపల్లి అందించిన సూచనలు, ప్రోత్సాహంతో ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయాన్ని శ్రీరామనవమి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక లాంఛనాలకు ఎంపిక చేయడం మొదలు, ఈ క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనమమి వేడుకలు నభూతో నభవిష్యత్తు అన్న విధంగా నిర్వహించడం, ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్‌ను శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా తీసుకురావడంలో తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకుపోవడంతో పాటు భవిష్యత్తులో ఒంటిమిట్ట క్షేత్రం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునేందుకు ప్రభుత్వ సహకారం కావాలంటే కూటమి అభ్యర్థిని గెలిపించాలన్న నినాదంతో ప్రజల్లోకి వెళుతున్నారు. మొత్తానికి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్ట మండలంలో కూటమి పార్టీ నేతలందరిని ఏకత్రాటిపైకి తీసుకొచ్చి జడ్పీటీసి ఎన్నికల్లో ఏకత్రాటిపైకి తీసుకొచ్చి ముందుకు నడిపించడంలో విజయం సాధించారని చెప్పవచ్చు.

## దాడి జరిగిన ఘటనపై వైఎస్ జగన్ ఆరా

పులివెందుల , ఆగస్ట్ 6, ప్రభాత వార్త

జడ్పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచార సమయంలో టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడి చేసిన ఘటన సంబంధించి వైసీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరా తీశారు. బుధవారం రాత్రి వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కు ఫోన్ చేసి ఘటన ఏమి విధంగా జరిగిందని తెలుసుకున్నారు. అలాగే దాడిలో గాయాలు ఎక్కడెక్కడ తగిలాయి అన్న విషయాలను తెలుసుకోవడం జరిగింది. దాడి జరిగిన తీరును క్షుణ్ణంగా వైఎస్ జగన్ కు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ టిడిపి నాయకులు చెత్త రాజకీయాలు చేస్తున్నారని భయపడకుండా ముందుకు వెళ్లాలన్నారు.

## వైకాపా నేతలపై దాడి పిరికిపంద చర్య

కడప కార్పొరేషన్ ఆగస్టు 6 ప్రభాతవార్త:



వైస్సార్సీపీ నాయకులు వేల్పుల రాము, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ లపై దాడి చేయడం దారుణం ప్రజాస్వామ్యంలో సరి అయిన విధానం కాదని వైకాపా సీనియర్ నాయకులు, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్. బిహెచ్ అన్నారు. ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయొచ్చునని, ప్రచారం నిర్వహించుకోవచ్చు, రాజ్యాంగ హక్కుల ప్రకారం ప్రతి ఒక్కరికి వాక్ స్వాత్రంత్రం వుందన్నారు. ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ అభ్యర్థి గురించి ప్రచారం చేసుకునే హక్కు వుందని తెలిపారు. వేల్పుల రాము పులివెందుల లోని మారుమూల ప్రాంతమైన వేల్పుల ను రాష్ట్రం లోనే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఆయనకు గల ప్రజాదరణ ఓర్చుకోలేక ప్రత్యక్ష దాడి చేయడం దారుణం అన్నారు. వేల్పుల రాము, రమేష్ యాదవ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వైస్సార్సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్. బీహెచ్ కోరారు.

## ప్రచారాన్ని ప్రారంభించిన తులసి రెడ్డి



వేంపల్లి: ఆగస్టు 06 (ప్రభాత వార్త);

పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నిక ప్రచారాన్ని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి బుధవారం వేంపల్లి లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12 వ తేదీన పులివెందుల మండల జడ్పిటిసి ఉప ఎన్నిక జరగబోతోంది. ఈ ఎన్నికల్లో మొయిళ్ళ శివ కళ్యాణ్ రెడ్డి హస్తం గుర్తు మీద కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. హస్తం గుర్తు మీద ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి అయిన శివ కళ్యాణ్ రెడ్డిని గెలిపించాలని పులివెందుల మండల ఓటర్లకు తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి, ధృవకుమార్ రెడ్డి, అభ్యర్థి మొయిళ్ళ శివ కళ్యాణ్ రెడ్డి, సిరాజుదీన్,గౌస్ పీర్, రామకృష్ణ, సుబ్రమణ్యం, వెంకటేష్,రామాంజనేయ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు,వేమయ్య, వేమా రాజా,రవి,రమణ, గంగయ్య,సుధాకర్ రెడ్డి, అమర్, నరసింహం, హరిప్రసాద్, సంజయ్ కాంత్,విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు



రామసముద్రం ఆగస్ట్ 6 ప్రభాతవార్త

మండలంలోని మినికి గ్రామంలో వెలిసిన శ్రీకళ్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో సర్పంచ్ జమున సుబ్బారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కేశవ రెడ్డి, వైసీపీ స్టేట్ జనరల్ సెక్రటరీ గెవన్న, భాస్కర్ గౌడ్, దొడ్డి పల్లె ఆనంద ఆధ్వర్యంలో మిథున్ రెడ్డి విడుదల కావాలని స్వామివారికి అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి వైసీపీ మండలం నాయకులు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. మండల వైసీపీ అధ్యక్షులు కేశవ రెడ్డి,స్టేట్ బిసి జనరల్ సెక్రటరీ గెవన్న,సర్పంచ్ జమున వైసీపీ సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్ వైస్ ఎంపిపి రమణారెడ్డి, సి హెచ్ ప్రకాష్, ఈశ్వర్ రెడ్డి వీరు మాట్లాడుతూ అక్రమ అరెస్ట్ కు గురైన రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి ని 18 రోజులైన కూటమి ప్రభుత్వం నిర్బంధంలో ఉంచడం ఎంతవరకు న్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం

వేంపల్లె: ఆగష్టు 06 (ప్రభాత వార్త):



ఆంధ్రప్రదేశ్ లో నిరుపేద లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన వేంపల్లె లో విలేకరులతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల హామీ మేరకు చేనేతల శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకొని ఆగస్టు 7 నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనమన్నారు . ఇప్పటికే చేనేతల అభ్యున్నతికి పాటు పడుతున్న కూటమి ప్రభుత్వం, ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు పరచి నేతన్నలకు అండగా నిలవనుందని చెప్పారు. అంతేకాకుండా మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ను అందించి వారి జీవితాలలో వెలుగులు నింపారని అన్నారు. 125 కోట్ల రూపాయలు వెచ్చించి ఉన్నత ఆశయంతో అమలు పరస్తున్న ఈ పథకం ద్వారా 50 వేల మగ్గాలు, 15 వేల మర మగ్గాల వారికి లబ్ది చేకూరనుందని జిల్లా కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి తెలిపారు...

## రైతులందరికి యూరియాను అందజేస్తాం

వేంపల్లె: ఆగష్టు 06 (ప్రభాత వార్త):



జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదని రైతులందరికి అందజేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరి నాట్లు సాగు చేస్తుండడంతో యూరియా ఎక్కువగా అవసరం అవుతున్నట్లు చెప్పారు. జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరు అయినట్లు చెప్పారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇప్పటి వరకు 12 వేల 500 మెట్రిక్ టన్నులు రైతులకు ఇచ్చినట్లు చెప్పారు. ఇంకా 23 వేల 500 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. జిల్లాకు 20 వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు అయ్యిందని చెప్పారు. వాటిలో 12 వేల మెట్రిక్ టన్నులు రాగా 5వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇంకా 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. వేంపల్లె మండాలానికే 180 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్తు కాంట్రాక్టు కార్మికులను వేధిస్తున్న జూనియర్ ఇంజినర్‌ను సస్పెండ్ చేయాలి: ఏఐటీయూసీ డిమాండ్

పెండ్లిమర్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త:



ఉద్యోగులను, కార్మికులను వేధించడం, అవినీతికి మారుపేరుగా నిలిచిన పెండ్లిమర్రి సెక్షన్ విద్యుత్తు జూనియర్ ఇంజినీర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిట్టమీదపల్లెలోని సెక్షన్ కార్యాలయంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా పెండ్లిమర్రి సెక్షన్ జూనియర్ ఇంజినీర్ ఉద్యోగులు కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వేధించడం జరుగుతున్నదని వారన్నారు. ప్రతిదానికి ఉద్యోగుల యొక్క వేతనాలను కట్ చేస్తానంటూ బెదిరించడం కట్ చేయడం జరిగిందన్నారు. వేతనాలను కట్ చేసే అధికారం ఎవరికి లేదని ఏదైనా ఉద్యోగి తప్పు చేస్తే వారికి నోటీసు ఇచ్చి కట్ చేయాలని ఎలాంటి కార్మిక చట్టాలను అనుసరించకుండా ఇష్టానుసారంగా ఒక నియంతలాగా వ్యవహరించడం సరైంది కాదని వారన్నారు. ఇలాగే ప్రజల పట్ల కూడా దురుసుగా ప్రవర్తించడం చెయ్యి తడపనిదే పని జరిగే పరిస్థితి లేదన్నారు. ఈయన వేధింపులు మూలంగా కొంత మంది షిఫ్ట్ ఆపరేటర్లు రోగాల బారిన కూడా పడ్డారని వారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇతనిపై తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పై స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కె.సి.బాదుల్లా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురేష్, నాగిరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునయ్య, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హరి కేశవరెడ్డి, విశ్వనాథ్, రామకృష్ణ, జగదీష్, చంద్ర గంగిరెడ్డి, నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ బ్రాహ్మణ సోదర సోదరీమణులందరికీ తెలియజేయడమేమనగా 09 వ తేదీశ్రావణ శుక్ల పౌర్ణమీలు శనివారము రోజున శ్రీ రమాదేవి సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం దు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు నిర్వహించుచున్నందున ఆసక్తి కలిగినటువంటి వారు 07 వతేదీన సాయంత్రం లోపల మీ పేర్లను క్రింద కనపరచిన నెంబర్లకు ఫోన్ ద్వారా గాని వ్యక్తిగతంగా గాని కలిసి నమోదు చేసుకొనవల్సిందిగా కోరుచున్నాము. సంప్రదించవలసిన వారి నెంబర్లు 1)ది.వెంకటేశ్వర్లు 9440422195 2)టి. సత్యనారాయణ8328200697 3) బి సుబ్బ 1నరస య్య9581206080 4) కే అరుణ్ కుమార్ పూజారి 9866405340. ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణ సేవా సంఘం బద్వేల్. శ్రీ రమాదేవి సహిత సత్యనారాయణ స్వామి వ్రతములలో బ్రాహ్మణులు మరియు బ్రాహ్మణే తరులు కూడా పాల్గొనుటకు అవకాశం కలదు కావున ఆసక్తి కలిగినటువంటి వారు మీ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరుచున్నాము

## అన్నమయ్య, కడప జిల్లాల్లో 23మంది సీఐల బదిలీలు

రాజంపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:

అన్నమయ్య, కడప జిల్లాల్లో పనిచేస్తున్న 23మంది సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ కర్నూలు డీఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు వెంటనే వారికి కేటాయించిన సర్కిల్‌లలో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి..

| సీఐ పేరు | ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం | బదిలీ అయిన స్టేషన్ |
|---|---|---|
| పీ.రాజా | రాజంపేట అర్బన్ | కొండాపురం |
| ఎస్.కుళాయప్ప | మన్నూరు అర్బన్ | రాయచోటి ట్రాఫిక్ |
| డి.నాగార్జున | వీఆర్ కడప | రాజంపేట అర్బన్ |
| పి.నరేష్ బాబు | యర్రగుంట్ల | జమ్మలమడుగు అర్బన్ |
| ఎస్.లింగప్ప | జమ్మలమడుగు అర్బన్ | బద్వేల్ అర్బన్ |
| ఎం.రాజగోపాల్ | బద్వేల్ అర్బన్ | ప్రొద్దుటూరు ట్రాఫిక్ |
| సి.భాస్కర్ రెడ్డి | వీఆర్ కడప | జమ్మలమడుగు రూరల్ సర్కిల్ |
| ఎస్.విశ్వనాథ్ రెడ్డి | రాయచోటి ట్రాఫిక్ | యర్రగుంట్ల |
| ఏ.సురేష్ రెడ్డి | వీఆర్ కడప | సోషల్ మీడియా, సైబర్ సెల్ కడప |
| పి.మహమ్మద్ రఫీ | కొండాపురం సర్కిల్ | మదనపల్లె 1టౌన్ |
| జే.ప్రసాద్ బాబు | వాయల్పాడు | మన్నూరు అర్బన్ |
| ఎస్.అనిల్ కుమార్ | కలకడ | కలికిరి అర్బన్ |
| డి.రాఘవ రెడ్డి | ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ | వాయల్పాడు |
| బి.లక్ష్మన్న | ములకల చెరువు సర్కిల్ | కలకడ సర్కిల్ |
| సి.వెంకటేశ్వర్లు | వీఆర్ తిరుపతి | ములకల చెరువు |
| పి.చంద్ర శేఖర్ | వీఆర్ అన్నమయ్య | ఎర్రంచందనం టాస్క్‌ఫోర్స్ |
| జి.జీవన్ | డి.కొత్తకోట | వీఆర్ నంద్యాల |
| కే.గోపాల్ రెడ్డి | వీఆర్ కడప | బి.కొత్తకోట అర్బన్ |
| కే.రాజా రెడ్డి | ఎస్.బి-3 అన్నమయ్య | మదనపల్లె 2టౌన్ |
| కే.రామచంద్రా | మదనపల్లె 2టౌన్ | అర్ఎస్‌ఏటీఎఫ్ అన్నమయ్య |
| ఎం.తిమ్మారెడ్డి | వీఆర్ అన్నమయ్య | ఎస్.బి-3 అన్నమయ్య |
| ఏ.మోహన్‌కుమార్ | డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య | వీఆర్ అన్నమయ్య |
| ఎస్.గురునాథ్ | వీఆర్ కడప | డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య |

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు:



ఒంటిమిట్ట . ఆగస్టు. 06(ప్రభాతవార్త)

ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్న ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానానికి ఎన్నిక పగడ్బందీగా నిర్వహించేందుకు ఒంటిమిట్ట మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది. మండలానికి చెందిన మండపం పల్లె ,మారయ్య గారి పల్లి గ్రామంలో కడప సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వుల మేరకు ఫ్లాగ్ మార్చ్, కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ 12వ తేదీన నిర్వహిస్తున్న జడ్పిటిసి ఎన్నిక శాంతియుత వాతావరణాల మధ్య అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కావున ప్రజలు తమ ఓటు హక్కును నిరభ్యంతరంగా సద్వినియోగం చేసుకోవచ్చని తాము భరోసా ఇస్తున్నామని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఎన్నిక సమయంలో ఎవరైనా ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తే శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారి పైన కేసులు పెట్టి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కావున గ్రామాల్లోని ప్రజలు సోదర భావంతో జాగ్రత్తగా ఉండాలంటూ తగు సూచనలు సలహాలిస్తూ హితవు పలికారు. ఈ పోలీసు కవాతు కార్యక్రమంలో కడప తాలూకా ఎస్ఐ నాగ తులసి ప్రసాద్, టూ టౌన్ ఎస్ఐ సిద్దయ్య, ప్రత్యేక పోలీసులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అప్రజాస్వామ్యం

ఖాజీపేట, ఆగస్టు 06, ప్రభాతవార్త:



పులివెందుల నియోజికవర్గంలో ఈ నెల 12న జరిగే జడ్పీటీసీ ఉప ఎన్నికల కోసం పులివెందుల మండలం నల్ల గొండువారి పల్లెలో చేస్తున్న ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వైసీపీ నాయకులపై, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైన చేసిన దాడి అప్రజాస్వామ్యమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. ఖాజీపేటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు కొలమానమని కూటమి నేతలు అందుకు భిన్నంగా ప్రవర్తించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. నేతలు ఎవరికి వారు ప్రచారం చేసుకోవలని అంతిమంగా ప్రజల తీర్పును గౌరవించాలే తప్ప ఇటువంటి భౌతిక దాడి హేయమన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. కూటమి నేతలు భౌతిక దాడులతో ప్రత్యర్థులను భయ భ్రాంతులకు గురి చేసి ప్రజలలో చులకన కావద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలలో మొదలైన వ్యతిరేకతను అణచివేయడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ అధికారులు ఇటువంటి వాటిని తీవ్రంగా పరిగణించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు.

## ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అప్రజాస్వామికం

### మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి

ఖాజీపేట, ఆగస్టు 06, ప్రభాతవార్త:



జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అప్రజాస్వామికం అని ఖాజీపేట వైకాపా మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఖాజీపేటలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లపురెడ్డి పల్లె పంచాయతీ నల్లగుండు వారి పల్లె గ్రామంలో జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకులతో మాట్లాడి తిరిగి వస్తున్న సంధర్భంలో వైసీపీ నేత ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మరియు వేల్పుల రాములపై తీవ్రంగా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటి చర్య అని ఇలాంటి హింసా రాజకీయాలు కూటమి ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాబలం వైకాపా వైపు ఉందన్న వాస్తవాలు గ్రహించిన తెదేపా దుండగులు ఇలాంటి భౌతిక దాడులు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని, గెలుపు ఓటములు అనేవి ప్రజాక్షేత్రంలో ప్రజల చెంతన తేల్చుకోవాలనీ రణక్షేత్రాన్ని సృష్టించి భయానక వాతావరణాన్ని సృష్టించి అల్లరి మూకల సహాయంతో గెలుపొందాలనుకోవడం తగదని అన్నారు. పోలీసులు సైతం నిష్పక్షపాత చర్యలు తీసుకొని దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## ఇంటింటి ప్రచారం

సిద్ధవటం ఆగస్టు 6 ప్రభాతవా ర్త

ఒంటిమిట్ట మండలం జడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో అబ్బు ర్వర్ చిట్టిబాబు మరియు నారాయణ పర్యవేక్షణలో టీడీపీ బృందం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించింది.సిద్దవటం మండలానికి చెందిన టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఇంటి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే కాలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రధానంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు విత్తన, ఎరువుల సహాయం, నిధుల మంజూరు వంటి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు టీడీపీకి తమ మద్దతు తెలుపుతూ హారతులు ఇచ్చి, జేజేలు పలికారు. కూటమి ప్రభుత్వం పాలనపై తాము పూర్తిగా సంతృప్తిగా ఉన్నామని పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సీనియర్ తెలుగుదేశం నాయకులు చెంచయ్య నాయుడు, మూలపల్లి రాజశేఖర్, యాదవ్ అక్కిశెట్టి మణి, రాంప్రసాద్, శివ, సుబ్బా రెడ్డి, మల్లు వెంకట సుబ్బా రెడ్డి, సుబ్బయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగు చేసిన పంటలను నమోదు చేసుకోండి



దువ్వూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో పొలం బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, మినుము, ఉల్లి, వరి వంటి పంటలు సాగు చేశారని వాటిని ఈ క్రాపింగ్ చేయించుకోవాలన్నారు. పంట ధృవీకరణ పత్రం పొందిన తర్వాత మీ సేవా కేంద్రానికి వెళ్లి నిర్ణీత మొత్తంలో డబ్బులు చెల్లించి పంటల భీమా కూడ చేసుకుంటే ఏదైనా ప్రకృతి వల్ల నష్టం జరిగితే భీమా వస్తుందన్నారు. ప్రస్తుతం గ్రామ పరిధిలో ఉల్లి పంట ఎక్కువగా సాగు చేశారని పొటాష్ వినియోగించాలని తెలిపారు. వేరుశనగ పంట సాగు చేసిన రైతులు ఎకరాకు 200కిలోల జిప్సం వాడాలన్నారు. ఏ పైరుకు ఎకరాకు 90కిలోలకు మించి యూరియా వినియోగించరాదని అలా అధికంగా వినియోగిస్తే పంటలకు తెగుళ్ల సోకి దిగుబడి, నాణ్యత లోపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి లేకపోతే అనర్హులు

మైదుకూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:

మైదుకూరు మండల వ్యవసాయ అధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంట నమోదు తప్పనిసరి అని లేకపోతే ప్రభుత్వ నుండి వచ్చే పథకాలకు అనర్హులు అవుతారని రైతులకు తెలిపారు.మండలంలోని సర్వాయ పల్లె మరియు పాతపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఈ. బాల గంగాధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు 5000 మరియు పిఎం కిసాన్ ద్వారా 2000 రూపాయలు కలిపి మొత్తంగా 7000 రూపాయలు రైతుల యొక్క బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే అన్నదాత సుఖీభవ అమోంటు పడకపోవడానికి గల కారణములను కూడా వివరించడం జరిగింది.పంటల బీమాకి సంబంధించి దరఖాస్తు చేసుకునే తేదీ జూలై 31కి పూర్తవగా ప్రభుత్వం వారు ఆ తేదీని ఆగస్టు 14 వరకు గడువును పెంచడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం నందు , రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.



## దూడల పెంపకంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



కలికిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త:

దూడల పెంపకంలో రైతులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దూడలు ఆరోగ్యకరంగా ఉంటాయని జిల్లా పశువైద్యాధికారి డా.గుణశేఖర్ పిళ్లై తెలిపారు. కలికిరి మండలం మర్రికుంటపల్లి గ్రామంలో రాష్ట్రీయ శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ తిరుపతి వారి ఆద్వర్యంలో మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి ఉపసంచాలకులు డా.వెంకట ముని నాయుడు, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డా.చిరంజీవి, మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డి రాము, మండల అధ్యక్షులు సూర్యప్రకాష్‌రెడ్డి, మరియు కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని అధిక శాతం రైతులు పాడి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సెలవిచ్చారు. ఈ సందర్భంఞ దూడల పెంపకంపై పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. లేగదూడల ప్రదర్శనకు విచ్చేసిన దూడలన్నిటికీ డి వార్మింగ్ మందులు తాపించారు. అదే విధంగా దూడలు పుష్టిగా ఎదగడానికి గ్రోత్ ప్రమోటర్లు మరియు మినరల్ మిక్చర్లు సరఫరా చేశారు. అదే విధంగా కేవలం పెయ్య దూడలు మాత్రమే పుట్టే విధంగా కట్టు సూదులు వినియోగించుకొని తద్వారా పుట్టినా కూడా ప్రదర్శనలో ఉంచారు. అనంతరం వచ్చిన దూడల నీటిలో మంచి జాతి లక్షణాలు మరియు శరీర బరువు మరియు పోషణ కలిగిన మూడు ఉత్తమ దూడల్ని ఎంపిక చేసి రైతులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి రైతుకు మినరల్ మిక్చర్ మరియు టానిక్‌లతో పాటు బహుమతులు అందజేశారు. అనంతరం పశుసంవర్ధకశాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ అవలంభిస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు డా.కీర్తి, డా.జగన్‌మోహన్‌రెడ్డి, డా.గిరినాథ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది మరియు పశుసంవర్ధక సహాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్‌లపై శిక్షణ

కడప కలెక్టరేట్, ఆగస్టు 6: ప్రభాతవా ర్త

పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జెడ్పి సీఈవో రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రిసైడింగ్ అధికారులకు, ఏపీవోలకు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సి.ఓబుళమ్మ, పులివెందుల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటపతి, ఒంటిమిట్ట అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రంగస్వామి, డివిషనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, వి.రామాంజనేయులు , రిసోర్స్ పర్సన్స్ ,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలసాధికారత కోసమే మిషన్ శక్తి

కడప కలెక్టరేట్, ఆగస్టు 6: ప్రభాతవా ర్త

మహిళల భద్రత, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ఖిమిషన్ శక్తిఖి కార్యక్రమాన్ని ప్రారంభించిందనీ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో.. మిషన్ శక్తి కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి మిషన్ శక్తి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మిషన్ శక్తిలో ఖిసంబల్ఖి మరియు ఖిసమర్థ్యఖి ఉప పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. "సంబల్" పథకం మహిళల భద్రతకు, "సమర్థ్య" పథకం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిందన్నారు. వన్ స్టాప్ సెంటర్లు (వీఓది) ద్వారా చట్టపరమైన కౌన్సెలింగ్, మానసికసామాజిక కౌన్సెలింగ్లు అందించాలని అలాగే చైల్డ్ మ్యారేజ్ నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు.సమర్థ్య పథకంలో భాగంగా బాధిత మహిళలకు పునరావసం కల్పించే శక్తి సదన్ లు కడపలో 3 మైదుకూరులో 1 పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో శక్తి సధన్లను బలోపేతం చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నైపుణ్య శిక్షణలు, ఉపాధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే బేటీ బచావో.. బేటీ పడావ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద బాలికల పుట్టుపుట్టిన దశ నుండే సంరక్షణ కల్పించేందుకు ఐసిడీఎస్, ఆరోగ్య, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మిషన్ శక్తి లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటిసారి ప్రసవానికి 5వేలు రూపాయలు, రెండవ ప్రసవంలో ఆడపిల్ల జన్మిస్తే 6వేలు రూపాయలు అందిస్తోందని తెలిపారు. మహిళల పరిరక్షణకు 181 ఉమెన్ హెల్ప్ లైన్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోష్ ఆక్ట్ కింద నమోదైన మూడు కేసులను పరిష్కరించామని తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, రైల్వే స్టేషన్, హాస్పిటల్స్ లలో మదర్ బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పిల్లల సమస్యలను తెలియచేయడానికి కార్యాలయాల్లో పాఠశాలల్లో సి బాక్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మహిళల కోసం చేపడుతున్న ప్రాజెక్టులు, స్కిల్స్ డెవలప్మెంట్ కార్యక్రమాల పురోగతిపై చర్చించారు.మహిళల హక్కులు, రక్షణ కోసం మిషన్ శక్తినీ సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

## ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని గెలిపించండి:

ఒంటిమిట్ట . ఆగస్టు. 06(ప్రభాతవార్త)



ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నిక ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్న నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ఇరగంరెడ్డి. సుబ్బారెడ్డి బుధవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో జిల్లాస్థాయి వైసీపీ అగ్రశ్రేణులతో ప్రచారం నిర్వహించి తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జిల్లాస్థాయి నాయకులైన మేడ .రఘునాథ్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గడికోట. శ్రీకాంత్ రెడ్డి, అంజద్ భాష, సురేష్ బాబు, రామచంద్రారెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, మండల స్థాయి నాయకులు కార్యకర్తల తోటి డప్పులతో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచారంలో భాగంగా ఓటర్లతో జిల్లా స్థాయి నాయకులు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జడ్పిటిసి అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలంటూ అభ్యర్థించడం జరిగింది. అంతకుముందు జిల్లా స్థాయి నాయకులకు మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు పూలమాలలతో డప్పులతో బాణా సంచాలతో గ్రామంలోకి ఆహ్వాన పలకడం జరిగింది.

## పేరు మార్పు

మూడే సోని (పాత పేరు), డోర్ నెంబర్ 1/89, సుగాలి తాండ, పందికుంట గ్రామం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా, ఎపి. మూడే యశస్విని (కొత్త పేరు)గా పేరు మార్చడమైనది. గమనించగలరు.

## పాస్‌పోర్టు పోయినది

ముద్దులూరు. శివ రామ్ ప్రసాద్ రాజు తండ్రి ముద్దులూరు. సిద్దిరాజు డోర్ నెంబర్:- 44/6-9 విజయనగర్ కాలనీ, చెమ్ముమియాపేట, కడప నగరం వైఎస్ఆర్ కడప జిల్లా, ఏపీ, 516003, నా పాసు పోర్ట్ నెంబర్ : బి-3478677 గల పాసు పోర్ట్ ఐటిఐ సర్కిల్ వద్ద పోయినది. దొరికినచో క్రింది నెంబర్కు తెలుపగలరు. సెల్ నెంబర్ :7013748009

## ఊచకోతకు 34ఏళ్ళు న్యాయం ఎప్పటికి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు ఆగస్టు 6 ప్రభాతవార్త:

చుండూరు మాల మృతవీరులకు స్థానిక మాల మహానాడు కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో ఘన నివాళుల ర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ చుండూరు నరమేధం మరణకాండకు 34 ఏళ్ల దేశమంతా మారు మోగింది. 6. ఆగస్టు 1991ఆంధ్ర ప్రదేశ్ గుంటూరు జిల్లా చుండూరు గ్రామం సరిగ్గా 34 ఏళ్ల క్రితం జరిగిన దారుణమైన సంఘ టన ఆధిపత్య భూస్వాముల కులాలకు చెందిన వారి దాడిలో ప్రాణాలు కోల్పో యిన వారితో పాటుగా మృతుదేహాలను చూసి ఇద్దరు ప్రాణాలు విడిచిపె ట్టారంటే ఈ మరణకాండ ఎంత దారుణంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు డా క్టర్ బి.ఆర్.అంబేద్కర్ కలలుగన్న స్వరాజ్యం మానవ స్వేచ్ఛరాజ్యం నేటికి రా లేదన్నారు "చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోకపోతే చరిత్ర మీకు గుణపాఠం నేర్పుతుంది"అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారి మాటలను గుర్తు చేసుకుం టూ జరిగిన చరిత్ర నుండి పాఠాలు నేర్చుకొని అందుకు తగిన వ్యూహాలను ని ర్మించుకుంటూ భవిష్యత్తు పీడిత కులాల నాయకత్వం ముందుకు వెళ్లాల్సిన అ వసరం ఉందని ఆలా ముందుకు వెళ్లడానికి స్ఫూర్తినిచ్చే క్రమంలో తమ ప్రాణా లు త్యాగం చేసిన మాల అమరవీరులకు ఘనమైన నివాళులర్పించారు.

## రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం.

మైదుకూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ ప్రారంభించిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం మైదుకూరులో ఘనంగా జరిగింది. బుధవారం స్థానిక ఐ.సి.డి.ఎస్. కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు తాలూకా అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.ఎన్. ప్రతాప్ మరియు మైదుకూరు తాలూకాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీ.యం సహాయ నిధి చెక్కును అందించిన కుప్పాల

సిద్ధవటం ఆగస్టు 6 ప్రభాతవార్త



మండలం బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ ఆకురోపల్లె హరిజన వాడలో వుండే గంపాల శోభా, చంద్రలకు రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇటీవల గంపాల కొండయ్య అనారోగ్య కారణంగా హాస్పిటల్లో చేరారు కానీ దురదృష్టవశాత్తు ఆయన మరణించడం జరిగింది. ఆయన వైద్యం కోసం అయిన ఖర్చులు, బిల్లులు సీ.యం సహాయ నిధికి పంపించగా వారికి బుధవారం 100,568 రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సుధా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 22 గొర్రె పిల్లలు మృతి.

తొండూరు ఆగస్టు 6 ప్రభాతవార్త:



స్థానిక తొండూరు మండలం కోరవానిపల్లి గ్రామానికి కొప్పల రామమోహన్ కు చెందిన 22 గొర్రెపిల్లలు,మేక పిల్లలు కుక్కల దాడిలో మరణించడం జరిగినది. మంగళవారం అర్థరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు మూకుమ్మడిగా వచ్చి దాడి చేసి వాటిని కర్కషంగా కొరికి చంపడం జరిగింది . ఈ మధ్యకాలంలో పల్లె లో పట్టణాలలో కుక్కలు అధికంగా పెరిగి వాటి బారిన మనుషులు, మూగజీవాలు సైతం వాటికి బలైపోతున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై తగుచర్యలు తీసుకొని నివారించాలని ప్రజలు వాపోతున్నారు. ఇవి చనిపోవడం వలన గొర్రెల కాపరికి సుమారు 1 లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఎండా అనకా వాన అనకా పగలు రేయి కష్టపడి వాటిని కాపాడుకుంటూ ఉన్నామని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో తమ కుటుంబ పోషణ నడుస్తుందని ప్రభుత్వం తగిన పారితోసికం ఇవ్వాలని గొర్రెల కాపరి పేర్కొన్నారు.

## అన్నమాచార్యలో బ్రెస్ట్ ఫీడింగ్ డే

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బ్రెస్ట్ ఫీడింగ్ డే సందర్భంగా రాజంపేట మండలం తాళ్లపాక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన మహిళా విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యంగా, ప్రతి తల్లి కనీసం 6 నెలల పాటు తమ శిశువుకు తల్లి పాలను ఇవ్వాల్సిన అవసరాన్ని వారు వివరించారు. గ్రామస్తుల్లో మాతృపాల అవగాహన పెంపొందించడంలో ఇది పెద్ద పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం తరపున తాజాగా ప్రసవించిన మహిళలకు బ్రెడ్ మరియు ఫలాలను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమం వైస్ ఛాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి మార్గదర్శకత్వంలో, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.కె.జనార్ధన్, విభాగీయ ఎన్ఎస్ఎస్ ఇంచార్జులు, ఏఐటిఎస్ ప్రిన్సిపల్ డా. ఎస్. ఎం.వి. నారాయణ, హెచ్ అండ్ ఎస్ హెచ్ఓడీ డా. ఎల్. ఓబులపతి సమక్షంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించి, తాళ్లపాక గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జడ్పిటిసి ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం

ఒంటిమిట్ట . ఆగస్టు. 06(ప్రభాతవార్త)



ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నిక ఈనెల 12వ తేదీన పోలీస్ బలగాల మధ్య అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి పూల. భాస్కర్ బుధవారం మండలంలో పర్యటించి తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన తమ కార్యకర్తలతో కలిసి నరసన్న గారి పల్లి , దవంతరంపల్లి, గొల్లపల్లి , దర్జీపల్లి, గంగపేరూరు ,మలకాటి పల్లి గ్రామాల్లో పర్యటించి తనకు తమ పార్టీకి సంపూర్ణ మద్దతు నిచ్చి ఓటు వేయాల్సిందిగా ప్రజలను కోరడం జరిగింది. మండలాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ తోడుగా నిలుస్తుందని ప్రజా సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో ఉంటుందని అనది కాలంలో పరిష్కారం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కనిశెట్టి నరేష్, మహదేవయ్య, సింహాద్రి, విజయకుమారి, శివకుమార్, అమీర్, సర్దార్, సలీం, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ యూనివర్సిటీలో పేరెంట్స్ సమావేశం

కురబలకోట ఆగస్టు 6 ప్రప్రభాతవార్త



మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు బి.టెక్ చదువుతున్న విద్యార్థులకు (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ) విభాగము వారు పేరెంట్స్ మీట్ ను ఏర్పాటుచేసినారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రామనాథన్, మోటివేటర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎడ్యుకేషన్‌పై ఆసక్తితో చదవాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ఉన్న మమకారం తో పాటు వారిని సరైన బాటలో నడిచేలా చూసుకోవాలన్నారు. మీ చదువులకు మీ తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో మీరు దృష్టిలో ఉంచుకొని విజయం వైపే వెళ్లాలని అన్నారు. కళాశాల విభాగాధిపతి డాక్టర్. పద్మ మాట్లాడుతూ కళాశాలలో చదివే ఇంటర్న్‌షిప్స్ కు వెళ్లడం ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జి పొందవచ్చని, దాని ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాలను సకాలం లో ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమం లో విభాగాధిపతి డాక్టర్ పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఈ క్రాపు చేసుకోవాలి

రామాపురం, ఆగస్టు 06 ప్రభాతవార్త



పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి నాగమణి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి. సరస్వతిపల్లి గ్రామాల్లో బుధవారం సూరం రాఘవరెడ్డి పొలం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ క్రాప్ చేసుకున్న రైతులు ఆధారంగా ప్రభుత్వం నుంచి అందుతున్న అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ క్రాప్ చేసుకొని రైతులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న పథకాలు రావు అన్నారు. ఈ క్రాప్ చేసుకోని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల వద్ద అర్జీలను నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. రైతుల బ్యాంక్ అకౌంట్ ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది. మనోహర్. సాయికృష్ణ. రైతులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాలు

రామాపురం, ఆగస్టు 06 ప్రభాతవార్త

రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకుల సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయని అన్నమయ్య జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని గంగనే రు క్రాస్ వద్ద అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ యొక్క పాఠశాలలో నీటి సమస్య ఎక్కువగా ఉందని రెండు త్రాగునీటి బోర్లలో నీరు అడుగంటిపోయి తక్కువ వస్తున్నాయని దీంతో చాలా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆయనకు తెలిపారు. భోజన వసతులు గురించి పరిశీలించగా ఇప్పుడున్న ప్రభుత్వం సన్న బియ్యం భోజనం ఏర్పాటు చేస్తుండడంతో భోజనం వసతులు సంతృప్తిగా ఉండడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలోని ఎస్సీ ఎస్ టీ బీసీ గురుకుల, మరియు సంక్షేమ పాఠశాల, వసతి గృహాలలో విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన భోజనాలు మంచి ప్రోటీన్లు కలిగిన ఆహారాలని అందచేస్తుందని ఈ అవకాశాన్ని ఎస్సీ ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యకరం

రామాపురం, ఆగస్టు06 ప్రభాతవార్త



అప్పుడే పుట్టిన శిశువుకు గంటలోపు తల్లి ముర్రుపాలు పండించడం వల్ల బిడ్డ తల్లి ఆరోగ్యకరంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత ఎం ఎల్‌హెచ్‌పి ప్రవీణ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూర్ సెక్టార్ కుమ్మర పల్లి అంగన్వాడి కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డ పెరుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా లభిస్తుందన్నారు. తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రసవ సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉంటారు బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఉమాదేవి అంగన్వాడి టీచర్లు ఆయాలు ఆశ వర్కర్లు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదంటూ తంబళ్ళపల్లె మండలం కన్నెమడుగు దాయాదులు, వీరభద్రస్వామి ఆలయ నిర్వాహకులు హెచ్చరించారు. బుధవారం మదనపల్లెలోని ఎంపి మిథున్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెమడుగుకు చెందిన ఆలయ నిర్వాహకులు రవిశంకర్‌రెడ్డి(చిన్నబాబు), శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ అని చెప్పుకొంటున్న జయచంద్రారెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. గ్రామంలో నిర్మించిన వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూపాయి ఇవ్వకపోయినా విమర్శలు మాత్రం చేస్తుండడం ఎంతవరకు సమజసం అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆలయ పునఃనిర్మాణం కోసం దేవాదాయశాఖను ఆశ్రయించగా రూ.1.07కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ఇందులో ఆలయ నిర్వాహకులు 20శాతం నిధులు జమచేస్తేనే ఈ మొత్తాని విడుదల చేస్తామని చెప్పడంతో ఆలయ ఆరాధికులమైన తాము చందాలు వేసుకొని రూ.21లక్షలు ఎండోమెంట్‌కు జమ చేయగా దేవాదాయశాఖ తరపున నిధులను విడుదల చేయడంతో ఆలయ నిర్మాణం కొనసాగించామన్నారు. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆలయ నిర్మాణం ఆగిపోయిందని ఈ తరుణంలో టిడిపి ఇన్‌చార్జ్‌గా ఉన్న జయచంద్రారెడ్డి ఆలయ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారే తప్పా పనులు ముందుకు సాగడానికి సహకరించాలని ఆరోపించారు. అధికారులతో సంప్రదింపులు జరిపి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. ఇటీవల ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవం చేశామన్నారు. ఇది ఓర్వలేని జయచంద్రారెడ్డి పెద్దిరెడ్డి కుటుంబంపైన కన్నెమడుగు దాయాదుల పైన విమర్శలు చేయడంపై వారు విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో బిందుకుమార్‌రెడ్డి, చిన్నరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, మహేష్, సర్పంచ్ పాల్గొన్నారు.

## మొయిళ్లకాల్వలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం

పెండ్లిమర్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాల్వ పంచాయతీలోని గంగులయ్య గారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తల్లి పాల యొక్క ప్రాముఖ్యతను గురించి గర్భవతులు బాలింతలకు మరియు తల్లులకు తెలియజేయడం జరిగింది. ప్రతి తల్లి తన బిడ్డకు గంటలో పాలు ఇవ్వాలని తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా చాలా లాభాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులు పాల్గొనడం జరిగింది.

## వెలుగుసంస్థచే 104 వైద్య శిబిరాలు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :

వెలుగు సంస్థ, ప్రభుత్వ సహకారంతో బుధవారం రూరల్ మండలంలో 104 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెలుగు కార్యదర్శి ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని కోళ్ళబైలు పంచాయితీ, అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు సంస్థలో చిన్నారులకు, వృద్దులకు ఉచిత వైద్యశిబిరంలో వైద్యసేవలను అందించారు. ముఖ్యంగా చిన్నారులకు, వృద్దులకు రక్తపరీక్షలు, షుగర్, బీపి, సాధారణపరీక్షలు చేసి అవసరమైన వారికి సూచనలు తెలియజేసి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టు కోఆర్డినేటర్ డాక్టర్ పి.లోకనాథం, వైద్యాధికారి దివ్య, డీఈఓ ఉషారాణి, ప్రవీణ్, సాయిగణేష్ కమ్యూనిటి హెల్త్ అధికారి, ఆశావర్కర్లు, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్‌వర్కర్ గీతా, వార్డన్ స్వీటి తదితరులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమం

నిమ్మనపల్లి ఆగస్టు 6 ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వంలో రాజకీయంగా అణగదొక్కడం తప్ప అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ లేదని, పాలన గాలికి వదిలేసిందని చంద్రబాబునాయుడు ఐదు కోట్ల మంది ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాన్ని ప్రజల ముందు వుంచడం నిమ్మనపల్లి మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుకు చేస్తూ నిర్వహించిన కార్యక్రమం ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులతో కలిసి గ్రామస్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గుర్తుకు తెచ్చారు. ఈ సందర్భంగా కోమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుకు చేస్తూ చేపట్టిన కార్యక్రమం చేపట్టడం జరిగిందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఒట్లు కోసం వెళ్ళే కూటమి నాయకులను ప్రజలు చీకొట్టడానికి ఇది సరైన కార్యక్రమం అని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, బీరంగి రేవతి,రఘునాథరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రెడ్డి భాస్కర్, దొర, విజయకుమార్ రెడ్డి, ఉదయ్ శేఖర్ రెడ్డి, హేమంత్ కుమార్, యోగనంద రెడ్డి,వేముల రెడ్డి శివకృష్ణ, రవితేజ,రెడ్డిశేఖర్ రెడ్డి, శశి రెడ్డి, హోటల్ రఫీ, బి నవాజ్ హుస్సేన్ రుఖియా బేగం, వి. రఘునాథ రెడ్డి భాస్కర్ రెడ్డి, గంగరాజు, తీ. శ్రీనివాసులు రెడ్డి, మహమ్మద్ రఫీ, శామీర్, అహమ్మద్జాన్, హసీమ్, రియాజ్, కదిరప్ప, కాలేషా, అలికౌసర్, గ.శ్రీనివాసులు, నరసింహులు, గిరి, రెడ్డి, రవీంద్ర సుధాకర, చిన్న రెడ్డప్ప, ఎర్రనాయుడు, శంకర్ రెడ్డి, పాలేటి, సూర్యతేజ, అహశాన్ రమణ పెద్ద సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన ఇర్ఫాన్ భాష

ప్రొద్దుటూరు ఆగస్టు 6 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డులో శివాలయం వీధి నుండి కసెట్టి స్కూల్ వరకు ఉన్న ప్లాట్ఫారంపై మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పూడికలు తీయించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ ఇర్ఫాన్ భాష విజ్ఞప్తి చేశారు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వార్డులోని సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా 13వ వార్డులోని పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కమీషనర్ కు విజ్ఞప్తి చేశారు అలాగే వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా చేయాలని అందుకు తగిన ప్రణాళిక రచించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.

## పచ్చదనం పరిశుభ్రతపై కళాజాత

పెనగలూరు ఆగస్టు 6 ప్రభాతవార్త



పచ్చదనం పరిశుభ్రత సీజనల్ వ్యాధులు రక్షిత మంచినీరు తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం రాజమండ్రికి చెందిన విభూతి ఉమా శంకర్ కళాబృందం పెనగలూరు బస్టాండ్ మూడు రోడ్ల కూడలి లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్ల నుండి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా డబ్బాలలో పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. అలాగే పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్లను పెంచాలన్నారు. ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులను స్టీల్ సిల్వరపాత్రలను వాడాలన్నారు. డెంగ్యూ జ్వరాలను నివారణ కొరకు కొబ్బరి బోండాలు ఖాళీ టైర్లలో నీళ్లు నిల్వ ఉంచకూడదన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు సురేష్ శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకులకు మహిళలు మంగళహారతులు



ఒంటిమిట్ట . ఆగస్టు. 06(ప్రభాతవార్త)

ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లి పంచాయతీ రాచపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి .జగన్మోహన్ రాజు, జనసేన పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు ఎల్లటూరి. శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్న ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానానికి దేశం పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి కూటమి నాయకులతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పంచాయతీ, గ్రామ మహిళలు కూటమి నాయకులకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు పంచాయతీ ప్రజలతో మాట్లాడుతూ త్రిముఖ పార్టీల అండదండలతో మండల ప్రజల ఆశీర్వాదాలతో తెలుగుదేశం పార్టీ నుంచి ఒంటిమిట్ట జడ్పిటిసి అభ్యర్థిగా ముద్దు కృష్ణారెడ్డి పోటీ చేయుచున్నాడని కావున మండల ప్రజలు ఆశీర్వదించి తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుకు వేసి అభ్యర్థిని గెలిపించాల్సిందిగా కోరడం జరిగింది. ప్రచారంలో ఆరు మండలాల తెలుగుదేశం, జనసేన, బిజెపి అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు 10 గొర్రెలు మృతి

ముద్దనూరు.ఆగస్టు.06 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్త చౌటుపల్లె గ్రామం సమీపంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై 10 గొర్రెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు గొర్రెల కాపరుడు సత్యనారాయణ గొర్రెల మంద సమీపంలోనే ఉండటంతో అతను కూడా పిడుగుపాటుకు గురై స్వల్ప గాయాలకు గురి కావడంతో స్థానికులు కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పిడుగుపాటుకు గొర్రెల మందలోని గొర్రెలు చల్లాచెదురుగా వెళ్లిపోయి బుధవారం కూడా ఎంత వెతికినా కనిపించలేదని గొర్రెల కాపరులు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు ఆగస్టు 6 ప్రభాతవార్త:

అధికారం లేనప్పుడు కార్యకర్తల కష్టనష్టాల్లో తోడుగా ఉండే వారినే నాయకుడంటారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులో మండలస్థాయి వైకాపా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీలన్నీ ఉత్తమాటలేనని తేలిపోయాయన్నారు. రాష్ట్రంలో బాబుషూరిటీ మోసం గ్యారెంటీ అన్న చందంగా కూటమి ప్రభుత్వ పాలన ఉందన్నారు. అనంతరం నియోజకవర్గంలో వైకాపాలో చురుగ్గా ఉండే యవకులకు ఆయా స్థాయి బట్టీ పార్టీ పదవులు ఇచ్చి వారికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వక్తలు కూటమి పార్టీ వైఫల్యాలను ఎండగట్టారు ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు కేశవరెడ్డి, శివారెడ్డి, నీళ్ల భాస్కర్, శ్రీధర్రాయల్, చంద్రశేఖర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

పీలేరు ఆగస్టు 6 ప్రభాతవార్త :



విద్యాసంస్థల్లోకి మేనేజ్మెంట్ కమిటీ సభ్యులను, తల్లిదండ్రులను తప్ప మిగతా ఎవరినీ అనుమతించరాదంటూ పాఠశాల విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఈ నిర్ణయం ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉందని వైయస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధికార పార్టీ ప్రతినిధి సుంకర చక్రధర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బయటికి రాకుండా విద్యార్థుల నోరునొక్కే ప్రయత్నమే ఇదని తెలిపారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని, అక్కడ జరిగే అనేక అన్యాయాలను విద్యార్థి సంఘాలు మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ఘటనలు చాలా ఉన్నాయని చెప్పారు. ఇలాంటి ఉత్తర్వుల ద్వారా ఇక నుండి కార్పొరేట్ ప్రైవేట్ వ్యాపారం అన్యాయాలను బయటికి తీసే అవకాశం లేకుండా పోతుందని, ఈ ఉత్తర్వులు అప్రజాస్వామయమని, స్వేచ్ఛను హరించే విధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థివిభాగం పీలేరు నియోజకవర్గ అధ్యక్షుల లోకనాథం, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మూరె భువనేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకనాథ్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి, గుంపురవి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కెవిపల్లి ఆగస్టు 6 ప్రభాతవార్త:

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. బుధవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపల్లెలో రైతులకు ఏపీసీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనజీవామృతం, విత్తన గుళికల తయారీ, నీమాస్త్రం తయారీ వంటి సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఖర్చు తక్కువ. అధికబడులతో పాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుందని ఆశించిన లాభాలు గడిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె ఏవోలు రమాదేవి. మాదవి. సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



మైదుకూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:

వనిపెంట మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల వి. నిర్మల (ఎఫ్.ఎ.సి ప్రిన్సిపల్ ), ఆధ్వర్యంలో బుధవారం సరస్వతీదేవి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కనుక సరస్వతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో భాగంగా గణపతి హోమం, రుద్ర హోమం, మరియు చండీ హోమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ మహోత్సవానికి హాజరైన కన్వీనర్ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్స్ యన్.శ్రీనివాసులు విగ్రహ దాత, బి.శివ బాలిరెడ్డి, సూర్యనారాయణ, మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్స్ మరియు ఉపాధ్యాయులు,వనిపెంట మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 10 ఎర్రచందనం దున్గలు స్వాధీనం..

సుండుపల్లె, ఆగస్టు 06, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా డీఎఫ్ఓ ఆదేశాల మేరకు మరియు మదనపల్లి సబ్ డి ఎఫ్ ఓ సూచన మేరకు సానిపయ్ రేంజ్ రాయవరం సెక్షన్ సుండుపల్లి బీట్ లోని సద్దికోళ్ల వంక చెక్ పోస్ట్ దగ్గర నాకా బంది నిర్వహించి తనిఖీ చేస్తుండగా ఉదయం కారు అతివేగంగా వచ్చి బ్యారికేడు వేసిన విషయమును పసిగట్టిన డ్రైవర్ సుండుపల్లె రహదారిపై అతివేగంగా వెళ్లగా తమ సిబ్బంది వాహనాన్ని వెంబడించిగా సిబ్బందిని చూసి వాహనం నిలిపేసి కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారు కాగా హుండాయ్ వాహనం స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా అందులో 10 ఎర్రచందనం దుంగలు వాటి బరువు సుమారు 326 కేజీలు హుండాయ్ వాహనంతో కలిపి 6,00,000 లక్షల రూపాయలు ఉంటుందని తెలియజేశారు. ఈ వాహన తనిఖీలలో రాయవరం డిఆర్ఓ ఎస్ రమేష్ బాబు, సుండుపల్లి ఎఫ్ బి ఓ అంజన స్వాతి, వాన రాజ్ పల్లి ఎఫ్ బి ఓ గౌషా, మరియు బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు అని సానిపాయ్ రేంజ్ అధికారి వైసి రెడ్డి తెలిపారు.

## ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం.

మైదుకూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:



ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు అయిన నంద్యాలంపేట, శెట్టివారిపల్లి, వనిపెంట, లెక్కల వారి పల్లి,మైదుకూరు ఉర్దూ హైస్కూల్ ,గర్ల్స్ హై స్కూల్, ఎస్.మైదుకూరు ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, ఎస్‌టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ మోహన్ మాట్లాడుతూ విద్యా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టియు కృషి చేస్తుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డిఎలు చెల్లించాలని,ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై.వెంకట సుబ్బయ్య, అసోసియేట్ అధ్యక్షుడు జి.మల్లేశ్వర రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి.కె సురేష్, ఎస్ టి యు మైదుకూరు రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వర రాజు,ఎస్ టి యు మండల అధ్యక్షులు రమణయ్య, జి.చంద్ర శేఖర్,కె.ఆనంద రావు, యు.రవీంద్రా రెడ్డి, ఈ.ఈశ్వరయ్య, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఇంటింటా కార్యక్రమంలో ఎమ్మెల్యే

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం రూరల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాలన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమంపై కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో బైగారి రాజానాయుడు, భారతినాయుడు, షంషీర్, సోమశేఖర్, కిషోర్, మధు, వెంకటరమణ, రామక్రిష్ణ, జేసిబి వేణు, ఈశ్వర్‌నాయుడు, గురునాథ్‌యాదవ్, చిన్నరాయుడు, రంగప్ప, దొరస్వామినాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొన్నూరుపాలెం కాలనీలో పర్యటించి సిసిరోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ.30లక్షలు మంజూరుచేశారు. త్వరలోనే ఈ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

## సమాజ క్షేమంలో
## పోలీసులకు వైద్యులకు మరింత బాధ్యత



**ప్రొద్దుటూరు ఆగస్టు 6 ప్రభాతవార్త**
సమాజంలోని ప్రజల క్షేమం విషయంలో పోలీసులకు వైద్యులకే మరింత బాధ్యత ఉంటుందని ప్రొద్దుటూరు డిఎస్పి పుతి భావన పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని తక్షశిల కోచింగ్ సెంటర్లో చదివి ఒకేసారి 36 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్ లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక తక్షశిల కోచింగ్ సెంటర్లో శిక్షణ పొంది ఒకేసారి మొదటి పోటీలోనే 36 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ఆమె అభినందనలు తెలుపుతూ ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మరి ముఖ్యంగా ఎంపికైన వారి తల్లిదండ్రులు ప్రోత్సాహం వల్లే ఈ విజయాలని అందుకున్న వారి తల్లిదండ్రులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తిగా తీసుకొని కానిస్టేబుల్ ఉద్యోగంతో సరిపెట్టుకోక మరింత ఉన్నత పదవులకు అర్హత పొందేందుకు నిత్యం కష్టపడి చదవాలని ఆయన సూచించారు. ఇదే కోచింగ్ సెంటర్లో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు అనంతరం కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆమె ఘనంగా సత్కరించారు. అదనపు జిల్లా అగ్నిమాపక అధికారి బసిరెడ్డి మాట్లాడుతూ మొదటి పోటీ పరీక్షలలోనే తక్షశిలా కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన 36 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిగా ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఇంతటితో ఆగకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వారి ఆనందాన్ని రెట్టింపు చేసే విధంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఎప్పుడైతే అకుంఠిత దీక్షతో నిరంతరం శ్రమిస్తారో వారు విజయాలు సాధిస్తారని అన్నారు ఒక్కసారి విజయం సాధించిపెట్టిన అనంతరం దక్కే గౌరవం మరువలేనిది అన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందకముందు జీవితం పొందాక జీవితంలో ఎన్నో మార్పులు ఉంటాయన్నారు. ఎంతో సంయమనంతో పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తక్షశిల కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సురేంద్ర సిబ్బంది నిర్మల్ సాగర్ సురేష్ నరేష్ మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం



సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**పీలేరు ఆగస్టు 6 ప్రభాతవార్త:**
పీలేరు మండలం, దొడ్డిపల్లి గ్రామంలో రూ.3.50 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన 33 /11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. బుధవారం పీలేరు పట్టణ శివారులోని కొత్తపేట నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ద్విచక్ర వాహనాల భారీ ర్యాలీ, భాజా భజంత్రీలు, మేళ తాళాలు, బాణసంచా మధ్య పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు జనం నీరాజనం పలికారు. ఈ కార్యక్రమం టిడిపి దొడ్డిపల్లి ఇన్చార్జ్ నారే సతీష్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలికిరి మండలం, సి. బర్నేపల్లి దగ్గర ఒకటి, పీలేరు మండలం గూడరేవుపల్లి సమీపంలో మరొకటి, ప్రస్తుతం దొడ్డిపల్లిలో ఒకటి, వాల్మీకిపురం మండలం, సాకిరేవుపల్లి దగ్గర ఇంకో సబ్ స్టేషన్ ను ప్రారంభించామని అన్నారు. ఇవే కాకుండా గుర్రంకొండ మండలం, పసలవాండ్ల పల్లి, కలకడ మండలం, బాలయ్యగారిపల్లి దగ్గర మరో రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చిందని, ఆగస్టు 15న శ్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించ నుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, కోటపల్లి శ్రీనాథ్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, ఇతర కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## పండ్ల తోటలకు ప్రోత్సాహకం

**దువ్వూరు, ఆగస్టు 06, ప్రభాతవార్త:**
ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహకాలు అందిస్తున్నామని ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఈసీ ప్రియాంకలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి సంవత్సరానికి 25వేల రూపాయల చొప్పున రాయితీ లభిస్తుందని దీనిని వినియోగించుకోవాలన్నారు. అలాగే శ్రామికులకు పని కల్పన చేయాలని పేర్కొన్నారు. ఎవరికైన శ్రామికులకు సరాసతి వేతనం వచ్చే విధంగా చూడవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే త్వరలో సామాజిక తనిఖీ బృందం వస్తుందని దానికి సంబంధించిన రికార్డులు అన్ని సక్రమంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## ఇస్టారుసారం మాట్లాడితే ఉపేక్షించాం

నియోజకవర్గ ఇంచార్జి బీటెక్ రవి

**పులివెందుల, ఆగస్ట్ 6, ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న బిటెక్ రవి

మా అధినేత పై ఇస్టారుసారం మాట్లాడితే ఉపేక్షించమని సొంత మీడియాతో అబద్ధం నిజం చేయాలని వైకాపా చూస్తోంది అని మా ఏజెంట్ ను ప్రలోభ పెట్టినందుకే ఘర్షణ జరిగింది అని నియోజక వర్గ ఇంచార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రచారం చేసుకోవడం కోసం వైసీపీకి కనంపల్లె, ఈ కోత్తపల్లె గ్రామాలలోనూ మాకు నల్లగొండువారి పల్లెలో అనుమతి ఇచ్చారు అని కానీ వేల్పుల రాము మరి కొందరు కలిసి మా పార్టీ ఏజెంట్ల దగ్గరికి వచ్చి ప్రలోభాలు పెట్టి ఒత్తిడి చేశారనీ అలా చేయద్దు అని వారించారని దీనితో రామలింగారెడ్డి వర్గీయులు మా కార్యకర్త పై కులం పేరుతో దూషిస్తూ దాడీ చేయడంతో మా కార్యకర్తలు రామలింగా రెడ్డి వారియులపై ప్రతి దాడి చేశారన్నారు.వాళ్ళు అడిగిన గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగలేదన్నారు.నిన్న జరిగిన గొడవలు లేని వ్యక్తుల పేర్లు పెట్టారు అని అన్నారు. వైకాపా వారు పోలీసులతో అరెస్ట్ చేయిస్తున్నారు అని పదేపదే చెబుతున్నారని పోలీసులు మాకు అవసరం లేదు అని పోలీసులు లేకుండా రండి తేల్చుకుందాం అని సవాల్ విసిరారు.మేము ఏ గ్రామానికి వెళ్ళినా పార్టీలో చేరుతున్నారు దానిని ఓర్వలేక మా పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

## అంతర పంటలతో అధిక ఆదాయం.



**చిట్వేలి, ఆగస్టు 6, ప్రభాతవార్త:**
అంతర పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చుని రైల్వే కోడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ మణి అన్నారు. బుధవారం స్థానిక సిఎం రాచపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తాను మాట్లడుతూ అర్హత గల ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవను పొందడానికి చర్యలు తీసుకున్నామన్నారు. అర్హత ఉండి లబ్ధి పొందని రైతులు సరైన వివరాలు తెలిపి తిరిగి పొందవచ్చని తెలిపారు. అనంతరాజుపేట వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్ రెడ్డి అరటి, బొప్పాయి, మామిడి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి సుధాకర్ ప్రతి రైతు తన పంట సాగుకు ఈ క్రాప్ చేయించుకుని ప్రభుత్వ రాయితీలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘము అధ్యక్షులు ధర్మయ్య, సురేష్ కుమార్ రాజు, విహెచ్ఎ లక్ష్మి నారాయణ, వెంకటాద్రి, కళ్యాణ్, ఆత్మ బి టి యం బాల సుబ్రహ్మణ్యం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మాతా శిశు సంరక్షణ భవనం ప్రారంభించిన పీలేరు ఎమ్మెల్యే



**కలికిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త:**
కలికిరి పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ భవన సముదాయాన్ని పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం ఉదయం 10.30 గంటలకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పవన్‌కుమార్ ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం తెలుపుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే సహకరించారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని వంద పడకల స్థాయికి ఉన్నతీకరించడానికి సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. టి.బి.ముక్త్ భారత్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. అలాగే టీబీ ముక్త్ భారత్ పోస్టర్స్‌ను ఆవిష్కరణ చేశారు. గతంలో టీబీ రోగులకు పౌష్టికాహార సహాయం నెలకు రూ.500 ఉండగా ప్రస్తుతం మన ప్రభుత్వం రూ.1000 చేసిందన్నారు. డీసీహెచ్ఎస్ డా.ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకొని డయాలసిస్ కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపామని సభకు తెలిపారు. కలికిరి సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు విశ్రాంత డీఎంహెచ్ఓ డా.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఆరు మందికి స్టేమి ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల వారి ప్రాణాలు కాపాడామని మరియు ఎవరికైనా ఏ సమయంలో అయినా గుండె నొప్పి, ఛాతిలో నొప్పి, శరీరం చమటలు పట్టడం, ఎడమ చేయి నొప్పి ఉండుట వంటి లక్షణాలు ఉంటే గుండె నొప్పి అని అనుమానపడి గోల్డెన్ అవర్ లోనే ఇక్కడకు తీసుకొని వస్తే వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఏ సమయంలో అయినా ఆసుపత్రికి వచ్చి సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి సింగల్ విండో ప్రెసిడెంట్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ మాలతి, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు డా.వెంకటరమణారెడ్డి, ఎ అస్లాం బాషా, గీత, కలికిరి పంచాయతీ యువ నాయకులు రెడ్డివారి యోగేష్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సనావుల్లా, ఇతర పార్టీ నాయకులు డీసీహెచ్ఎస్ డా.ఆంజనేయులు, అన్నమయ్య జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డా.రమేష్ బాబు, కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పవన్‌కుమార్, వైద్యులు డా.ఉదయ్‌కుమార్, డా.సిమ్రాన్, డా.వెంకటేష్, డా.ఆశాలత, డా.శశి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ప్రభాకర్, భూపతి, రిహానా, రేడియో గ్రాఫర్ రమణ, హెడ్ నర్స్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఖాజీపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుని ఎన్నిక

**ఖాజీపేట, ఆగస్టు 06, ప్రభాతవార్త:**
ఖాజీపేట పట్టణంలో వెలసిన వాసవీ కన్యక పరమేశ్వరి మాత కోవెలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుని ఎన్నిక జరిగింది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఆర్యవైశ్య సోదరులు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ప్రస్తుతం దరిసా గంగిశెట్టి అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఈయన పదవి కాలం పూర్తి కావస్తుండటంతో గురువారం నాడు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ఆర్యవైశ్య సోదరులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి తాతా వెంకట సుబ్రమణ్యం(మీసేవ సుబ్రమణ్యం) మరియు మడియాల మురళీ కృష్ణలు పోటీ పడుతున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నికలలో మొత్తం 173ఓట్లు ఉన్నాయి. ఖాజీపేట బస్టాండ్ పరిధిలో 110 ఓట్లు ఉండగా మెయిన్ బజారులో 63ఓట్లు ఉన్నాయి. మొత్తం 173ఓట్లలో ఎక్కువ ఓట్లు సాధించిన వారు అధ్యక్ష పదవికి ఎన్నికవుతారు. రాజకీయ ఎన్నికలకు ఏ మాత్రం తగ్గకుండా పోటాపోటీగా ఇరువర్గాలు ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.



## తల్లిపేరుతో మొక్కలు నాటి సంరక్షించాలి

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



మొక్కలు నాటుతున్న దృశ్యం

తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రూరల్ మండలం పొన్నూటిపాలెం గ్రామ పంచాయితీ రామిరెడ్డిగారిపల్లె ముత్యాలమ్మ ఆలయం వద్ద బిజెపి అధిష్టానం పిలుపుమేరకు మండల అధ్యక్షులు తరిగొండ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గసభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులతో కలసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లులేని కారణంగానే పర్యావరణ సమతుల్యత లోపిస్తోందని, ఒకచెట్టు కొట్టివేస్తే వంద మొక్కలు నాటాలన్నారు. మానవజీవితం పచ్చదనంతో ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు తరిగొండ వెంకటరమణారెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, నాయకులు బర్నేపల్లి రవికుమార్, భగవాన్, పులి నరేంద్రకుమార్‌రెడ్డి, పిల్లస్వామినాయక్, ఒసూరి కిరణ్‌కుమార్, ఆకుల క్రిష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, పూల నాగరాజు, నారదరెడ్డి, బండి ఆనంద్, జర్మనీరాజు, న్యాయవాది బాలజ్యోతి, జనసేన పార్టీ దారం అనిత, అడపా సురేంద్ర, హరిప్రసాద్, వాల్మీకి పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులను ప్రశాంతంగా ఉండనివ్వండి



డిఎస్పీ కి పిర్యాదు చేస్తున్న ఎంపీ మరియు వైసీపీ నాయకులు

**పులివెందుల ఆగస్ట్ 6, ప్రభాత వార్త:**
జడ్పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వెళ్లిన వైకాపా నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్ పై టిడిపి వర్గీయులు దాడి చేయడం హేయమైన చర్య వెంటనే ఘర్షణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటివి చర్యలు మళ్లీ పునరావృతమైతే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి , మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మెన్స్ సతీష్ రెడ్డి లు డిఎస్పి మురళికి వినతి పత్రం అందించి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి వద్ద నుంచి వైకాపా నాయకుల ,కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా పోలీస్ స్టేషన్ వద్దకు తరలివెళ్లారు. అనంతరం వారు డిఎస్పీ తో మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చేయడం శాంతి భద్రతలను కల్పించాల్సిన బాధ్యత పోలీసులదని మా మా మోనాన్ని చేతగాని తనంగా తీసుకుంటే తర్వాత జరిగే పరిణామాలకు మాది బాధ్యత కాదన్నారు. మంగళవారం సాయంత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి సురేష్ రెడ్డి మా కార్యకర్త అమరేష్పై దాడి చేశారనీ ఫిర్యాదు చేశామని వారిని అరెస్టు చేసి ఉంటే రామలింగారెడ్డి పై దాడి జరిగేది కాదన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ఉండడం మంచిది కాదని రోజులు ఎప్పుడు ఇలానే ఉండవని స్వేచ్ఛ వాతావరణం లో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కేవలం ఓటమి భయంతోనే కొంతమంది నాయకులు ఉంటారు అర్జెంట్ చేస్తూ దాడులు చేస్తున్నారని ఇప్పటికే వా టిడిపి వర్గీయులు ప్రొద్దుటూరు నీ సతీష్ రెడ్డిని కొడితే పని అయిపోతుందని పలువురుతో చెప్పినట్లు మాకు తెలిసిందని కావున మాపై ఎటువంటి దాడి జరిగినా మీదే బాధ్యతలని వారు డిఎస్పీకి తెలిపారు. ఇప్పటికి రామలింగారెడ్డి సురేష్ యాదవ్ లపై దాడి జరిగిన ఘటనపై పోలీస్ శాఖ నుంచి ఫిర్యాదు కూడా తీసుకోక పోవడం అటువైపు పోలీసులు వెళ్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. టిడిపి వర్గీయులు ఉదేశపూర్వకంగానే వాహనాలలో రాడ్లు కత్తులు పెట్టుకుని తిరుగుతున్నార న్నారు.వెంటనే ఇలాంటి దాడులు పునరావృతము కాకుండా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల న్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టిడిపి ఓటమి భయంతోనే ఇలా బయోపిక్ దాడులకు దిగుతోందని మా మోనాన్ని వారి చేతగానితనంగా తీసుకుంటే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పోలీసులు అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేసి పబ్బం కడుక్కోవాలనుకోవడం వేరే వాళ్ళకి తగదని దమ్ముంటే ప్రజా బలం ఉంటే స్వేచ్ఛాయిత న్యాయబద్ధమైన ఎన్నికలు జరిగేలా టిడిపి నాయకులు చూడాలని అప్పుడు ప్రజల్లో ఎవరు సత్తా ఉందో అర్థమవుతుందన్నారు. పోలీసులు కూడా టిడిపి వారికి మద్దతు పలుకుతున్నారని ఎవరు సహకరించక పోయినా కోర్టు ద్వారా న్యాయం పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య కంటి శిబిరానికి విశేష స్పందన.




**తంబళ్లపల్లె ఆగస్టు 6 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె మండలం ఎద్దుల వారి పల్లి పంచాయతీ పరిధిలోని మఠం లో మదనపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ చైర్మన్ బి భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు టి. నివేదిత 39 మంది కంటి రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. అందులో 21 మందికి ఆపరేషన్లు నిర్వహణకు మదనపల్లి తరలిస్తున్నట్లు తెలిపారు. వీరికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత ఆపరేషన్ తో పాటు మందులు, ట్రావెలింగ్, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి చికిత్స నిమిత్తం ఎద్దుల వారి పల్లి, కన్నెమడుగు, రేణిమాకులపల్లి, మర్రి మాకులపల్లి పంచాయతీల నుండి కంటిరోగులు తరలివచ్చారు.

## ప్రొద్దుటూరు పెయింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ప్రొద్దుటూరు పెయింటర్ యూనియన్ ఐదవ సమావేశం హరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మేస్త్రీలు అందరూ ప్రెసిడెంట్ గా నాగేంద్రను, వైస్ ప్రెసిడెంట్‌గ వెంకటకృష్ణను, సెక్రటరీగా పూసల ఏసోబుని, జాయింట్ సెక్రటరీగా జిఎస్ఎం భాషను, ట్రెజరీగా సాంబయ్యను, జాయింట్ ట్రెజరర్ గా చిన్నాను, సలహాదారులుగా మత్తయ్య, ప్రసాద్ రావు, కుండ బాల దాసు, శివప్రసాద్, రొక్కం సుబ్బరాయుడు, రవి, మదన్ సిరాజుద్దీన్, చంద్ర, హరినారాయణ, చంద్రారెడ్డి, భాషాలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రొద్దుటూరు పెయింటర్స్ యూనియన్ కు సాయశక్తిలా కృషి చేస్తానని తెలిపారు. సెక్రటరీ ఏసోబు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పెయింటర్స్ యూనియన్ మేస్త్రీలు. సీనియర్ మేస్త్రీలు కలిసి సెక్రటరీగా ఎన్నుకొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యూనియన్ లోని పెయింటర్స్ అందరికీ ప్రభుత్వం తరఫున ఏమేమి అవకాశాలు ఉన్నాయో ఎలాంటి ఇబ్బందులకైనా ఈ యూనియన్ తరపున సాయి శక్తుల కృషి చేస్తానని ఈ సమావేశంలోని అందరి తరపున హామీ ఇస్తున్నానన్నారు.

## న్యాయమూర్తుల అనవసర కాఫీ బ్రేక్‌లపై సుప్రీం కోర్టు ప్రతిపాదనలు

**బద్వేలు లీగల్, ఆగష్టు 06 ప్రభాతవార్త :**
కొంత మంది న్యాయమూర్తులు అనవసరంగా టీ బ్రేక్, కాఫీ బ్రేక్, ఈ బ్రేక్, ఆ బ్రేక్ అని లేస్తారు అంటూ సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వివరాలలోకి వెళితే... జార్ఖండ్ హై కోర్టులో రిజర్వ్డ్ క్రిమినల్ అప్పీళ్ళపై తీర్పులను ప్రకటించడంలో దాదాపు 3 సంవత్సరముల జాప్యం జరగడానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న హై కోర్టుల "పనితీరు ఫలితాలను" పరిశీలించడం వైపే సుప్రీం కోర్టు మొగ్గు చూపింది. "హై కోర్టు సాధిస్తున్న ఫలితాలు ఏమిటి? వ్యవస్థ పై మనం ఎంత మాత్రం ఖర్చు చేస్తున్నాము? బదులుగా పొందుతున్న అసలు ఫలితాలు ఏమిటి? పనితీరుకు కొలమానం ఏమిటి? అక్కడ ఉండవలసిన ప్రామాణికత ఏమిటి? కొంత మంది న్యాయమూర్తులు చాలా కష్టపడి పని చేస్తారనేది మనకు తెలుసు, వారి నిబద్ధత గురించి మేము ఎల్లప్పుడూ గర్వపడుతాము, కానీ దురదృష్టవశాత్తు మమ్మల్ని నిరాశపరిచే మరి కొందరు న్యాయమూర్తులు కూడా ఉన్నారు, మేము కొన్ని విషయాలను వింటూ ఉన్నాము. హై కోర్టుల పనితీరు పరంగా కొన్ని విచారించదగిన సమస్యలను పరిష్కరించే విషయములో మేము చాలా స్పష్టంగా మరియు నిర్మొహమాటంగా ఉండాలనుకుంటున్నాము, భోజన విరామం అవసరమే, కొందరు సాధారణంగా టీ బ్రేక్, కాఫీ బ్రేక్, ఈ బ్రేక్, ఆ బ్రేక్ కొరకు ఉచితాసనం నుండి లేస్తారు, వారు నిరంతరం ఎందుకు పనిచేయరు? ఇది మెరుగైన పనితీరు, మెరుగైన ఫలితం ఇస్తుంది" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. న్యాయమూర్తులు కాంత్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం నలుగురు దోషులు తమ అప్పీళ్ళపై విచారణ పూర్తయినా తీర్పులు వెలువడకపోవడంపై దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించింది. వారి క్రిమినల్ అప్పీళ్ళపై తీర్పులను హై కోర్టు రెండు, మూడు సంవత్సరముల క్రితం విచారించి తీర్పును రిజర్వ్డ్ చేసింది. కానీ ఉత్తర్వులు కూడా ఇంకా ప్రకటించలేదు. ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తరువాత హై కోర్టు ముగ్గురు దోషులను నిర్దోషులుగా విడుదల చేసింది. నాలుగవ కేసులో విభజన తీర్పును వెలువరించింది. మొత్తం మీద నలుగురు దోషులను కస్టడీ నుండి విడుదల చేయాలని కూడా ఆదేశించింది. పై పరిణామాలను పరిగణన లోనికి తీసుకుని జస్టిస్ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కేసు లేవనెత్తిన పెద్ద సమస్యపై అంటే తీర్పులను ఆలస్యంగా అందించడంపై దృష్టి సారించింది. తీర్పుల ప్రకటన కొరకు ఈ కోర్టు గతంలో సూచించిన కాలక్రమానికి మేము ప్రతిపాదించిన విధానాలకు కట్టుబడి ఉండాలి అని న్యాయమూర్తి కాంత్ అన్నారు. ఈ ఆదేశాలు వెలువరించినందుకు పిటీషనర్ల తరుపు న్యాయవాది ఫౌజియా వకీల్ కోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న అంశమని, హై కోర్టు సకాలంలో తీర్పులు ప్రకటించి ఉంటే పిటీషనర్లు 3 సంవత్సరముల క్రితమే జైలు నుండి బయటకు వచ్చేవారని ఆమె కోర్టుకు తెలిపారు. న్యాయవాది వ్యక్తం చేస్తున్న విచారంతో న్యాయస్థానం ఏకీభవిస్తున్నదని జస్టిస్ కాంత్ తెలుపుతూ జరిగిన విషయంపై బెంచ్ కూడా అసంతృప్తితో ఉందని తెలియజేశారు. గత వారం జనవరి 31, 2025 తేదీకి ముందు రిజర్వ్ చేయబడిన తీర్పుల వివరాలను సత్వరమే అందజేయాలని సుప్రీం కోర్టు హై కోర్టులను ఇదే కేసులో కోరింది. (పీలా పహాన్ మరియు ఇతరులు ఎదిరి స్టేట్ ఆఫ్ జార్ఖండ్ మరి ఒకరు డబ్ల్యుపి (క్రిమినల్) నెం.169/2025)

## రాష్ట్ర మైనారిటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా షాకీర్ నియామకం





ఎంపీతో ఉన్న షాకీర్ పాత చిత్రం

**పీలేరు ఆగస్టు 6 ప్రభాతవార్త :**
పీలేరు పట్టణానికి చెందిన మైనార్టీ యువ నాయకులు ఆది నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ముఖ్యంగా పెద్దిరెడ్డి కుటుంబముతో సక్యతగా మెలగడమే కాకుండా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పనిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే అయితే పార్టీ కోసం అహర్నిశలు కష్టపడటంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో రాష్ట్ర మైనారిటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా పెద్దలు నియమించడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా షాకీర్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నలలో వైయస్సార్ పార్టీలో చురుకుగా పని చేస్తానని నాకు పదవి రావడానికి కృషిచేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుటమే కాకుండా పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్ర రెడ్డి సైతం పదవి రావడానికి కృషి చేశారని వారికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు షాకీర్ తెలిపారు.

## కన్నులపండుగా బ్రహ్మంగారి మాసకళ్యాణం

**బ్రహ్మంగారిమఠం ఆగస్టు 06 ప్రభాతవార్త :**
భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞాని రచించిన జగద్గురువు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో అశేష జనవాహిని మధ్య కన్నుల పండుగగా శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కళ్యాణ మహోత్సవం లో పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రి స్వామి, వీరభద్రయ్య స్వామి, వీరం భట్లయ్య స్వామి వారి ధర్మపత్నిలతో కలసి మాస కళ్యాణలో పాల్గొన్నారని పిట్ పర్సన్ శంకర్ బాలాజీ , ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవ విగ్రహ దాత లైన బెంగళూరు వాస్తవ్యులు గౌరీ శంకర్ కుటుంబ వారు పిట్ పర్సన్ కు అందజేశారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని లో బ్రహ్మశ్రీ పాణ్యం దత్త శర్మచే ప్రవచనం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వైభవం ప్రవచనం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి తిలకించడానికి రాష్ట్ర నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులందరూపాల్గొన్నారు .ప్రధమ మాస కళ్యాణ మహోత్సవం సందర్భంగా దక్షిణ గాలిగోపురం పంచ కలశ ప్రతిష్టాపక కార్యక్రమం, గోపూజ, గర్భాలయం నుంచి కళ్యాణమూర్తుల ఊరేగింపు నూతన కళ్యాణ మండపం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టేం గురుప్రసాద్, తోట్లపల్లి ఆశ్రమ పీఠాధిపతి విరజనంద స్వామి, మాస కళ్యాణానికి శాశ్వత ఉభయ దాతలు ,తాత్కాలిక ఉభయ దాతలు, కందిమల్లాయపల్లె పుర ప్రజలు, భక్తులు, మహిళలు సమక్షంలో నిర్వహించారు.

### భక్తుల వద్దకే అన్న ప్రసాదం..

బ్రహ్మంగారి నిత్య అన్నదానంలో నూతనంగా భక్తుల వద్దకే అన్న ప్రసాదం (తిరుమల తరహా) అందిచ్చే కార్యక్రమాన్ని ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ శ్రీకారం చుట్టడంతో భక్తులు స్థానిక ప్రజలు, స్థానిక నాయకులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమానికి తోట్లపల్లి అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వాముల వారు పాల్గొన్నారు. రాజగోపురం కట్టించిన దాత వింజమూరు రమణయ్య యాదవ్ ,ప్రొద్దుటూరు కృష్ణమాచార్యులు స్వామి ,విశ్రాంతి ఉద్యోగస్తులు, భక్తులు,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

